గాయత్రీదేవిగా అలంకరణ

దేవీశరన్నవరాత్రి ఉత్సవాలను మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాల్లో వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా నవరాత్రుల్లో భాగంగా రెండోరోజు శుక్రవారం అమ్మవారిని గాయత్రీమాతగా అలంకరించారు. నిర్వాహకులు, భక్తులు అమ్మవారి ఆలయాలు, మండపాలకు చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం మండపాల వద్ద బతుకమ్మ సంబురాలు జరుపుకొన్నారు. మహిళలు, యువతులు కోలాటం వేసి ఆడిపాడారు.

– నెట్‌వర్క్ నమస్తే తెలంగాణ, అక్టోబర్ 4

పాలమూర్: కన్యకాపరమేశ్వరి ఆలయంలో గాయత్రీదేవీగా

నారాయణపేట: శక్తిపీఠంలో గాయత్రీదేవి అలంకరణలో

నారాయణపేట: మహాలక్ష్మీ అలంకరణలో మల్లాంభికాదేవి

మరికల్ : గాయత్రిదేవీగా దర్శనమిచ్చిన అమ్మవారు

జడ్చర్ల: సకలదేవతల ఆలయంలో మహాలక్ష్మీదేవీగా..

మక్తల్: కన్యకా పరమేశ్వరి ఆలయంలో లలితాదేవీగా..

దామరగిద్దలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్న మహిళలు

గ్రంథాలయాల అభివృద్ధికి కృషి

గ్రంథాలయ చైర్మన్లను సన్మానిస్తున్న ఎమ్మెల్యేలు పర్ణికారెడ్డి, శ్రీహరి

● శాఖ రాష్ట్ర చైర్మన్ రియాజ్

దేవరకద్ర, అక్టోబర్ 4: రాష్ట్రంలోని అన్ని గ్రంథాలయాలను అభివృద్ధి చేస్తామని రాష్ట్ర గ్రంథాలయశాఖ చైర్మన్ డాక్టర్ రియాజ్ పేర్కొన్నారు. దేవరకద్ర శాఖ గ్రంథాలయాన్ని శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రంథాలయంలో సౌకర్యాలను పరిశీలించి ఏమైనా సమస్యలున్నాయని గ్రంథాలయ జిల్లా కార్యదర్శి మనోజ్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. త్వరలో రాష్ట్రంలో అన్ని గ్రంథాలయాల్లో గ్రంథపాలకులను నియమించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి గ్రంథాలయంలో పాఠకులకు అన్నిరకాల దినపత్రికలు, పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు అందుబాటులో పెడుతామన్నారు. విద్యార్థులు ఉదయం, సాయంత్రం గ్రంథాలయానికి చేరుకొని పుస్తకపఠనం, పేపర్లు చదవడంతో జ్ఞానోదయం పెరుగుతుందన్నారు. ప్రతివిద్యార్థి, యువకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ నర్సింహారెడ్డి ఉన్నారు.

బతికించుకోవాలి

నారాయణపేట టౌన్, అక్టోబర్ 4: గ్రంథాలయాలను బతికించుకుంటే జ్ఞాన తెలంగాణను నిర్మించుకున్నట్లని రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని శీలా గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో జిల్లా గ్రంథాలయ చైర్మన్ ప్రమాణ స్వీకారోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పోలీస్ వేర్ హౌసింగ్ సొసైటీ చైర్మన్ గురునాథ్‌రెడ్డి, నారాయణపేట, మక్తల్ ఎమ్మెల్యేలు పర్ణికారెడ్డి, వాకిటి శ్రీహరితో కలిసి రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్ హాజరయ్యారు. ముందుగా రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వార్ల విజయ్‌కుమార్‌తో ప్రమాణ స్వీకారం చేయించారు. పోలీస్ వేర్ హౌసింగ్ సొసైటీ చైర్మన్ గురునాథ్‌రెడ్డి, ఎమ్మెల్యేలు పర్ణికారెడ్డి, వాకిటి శ్రీహరిలు మాట్లాడుతూ జిల్లాలో గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేయడంతోపాటు అవసరమైన చోట కొత్త గ్రంథాలయాలను ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం నూతన గ్రంథాలయ చైర్మన్ విజయ్‌కుమార్‌ను పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ అనసూయ, మార్కెట్ కమిటీ చైర్మన్ శివారెడ్డి, వైస్‌చైర్మన్ హన్మంతు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వేణుగోపాల్, కౌన్సిలర్ సలీం, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుడికి ప్రముఖుల నివాళి


నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

మూసాపేట(అడ్డాకుల), అక్టోబర్ 4: అడ్డాకులకు చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు సత్యనారాయణరెడ్డి(71) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం ఉదయం మృతిచెందాడు. విషయం తెలిసి దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ రాజశేఖర్‌రెడ్డితోపాటు ఆయా పార్టీల మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు సత్యనారాయణ పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

రేషన్ డీలర్ మృతి సంతాపం

భూత్పూర్, అక్టోబర్ 4: మండలంలోని అన్నాసాగర్ రేషన్‌డీలర్, బీఆర్ఎస్ కార్యకర్త మహ్మద్ అహ్మద్(55) శుక్రవారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి మృతుడి ఇంటికెళ్లి పార్థివదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. అదే విధంగా కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సత్తూర్ బస్వరాజ్‌గౌడ్, మాజీ కోఆప్షన్ ఖాజ, బీఆర్ఎస్ నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, రాజారెడ్డి, షాకీర్, సాబేర్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వత్తుగుండ్ల బీఆర్ఎస్ నాయకుడు గజలప్ప తండ్రి ఇటీవల మృతి చెందాడు. మాజీ ఎమ్మెల్యే ఎస్ రాజేందర్‌రెడ్డి శుక్రవారం గజలప్పను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఆయన వెంట రైతుబంధు సమితి మాజీ జిల్లా కన్వీనర్ భీమయ్యగౌడ్ తదితరులు ఉన్నారు.

– దామరగిద్ద, అక్టోబర్ 4

వెరిఫికేషన్ సకాలంలో పూర్తిచేయాలి

● మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేందిర బోయి
● డైట్ కళాశాలలో డీఎస్సీ సర్టిఫికెట్ల పరిశీలన తనిఖీ

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, అక్టోబర్ 4 : డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన కార్యక్రమం సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ విజయేందిరబోయి అధికారులకు సూచించారు. శుక్రవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని డైట్ కళాశాలలో కొనసాగుతున్న ధ్రువపత్రాల పరిశీలన కార్యక్రమాన్ని కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా అభ్యర్థులు, కమిటీ సభ్యులతో మాట్లాడారు. పరిశీలన పూర్తయిన వెంటనే వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపర్చాలని సూచించారు. వెరిఫికేషన్‌కు గైర్హాజరైన అభ్యర్థులను ఫోన్‌లో సంప్రదించి 1:3 నిష్పత్తికి ఎంపికైన అందరి సర్టిఫికేట్లు పరిశీలన చేసుకునేలా చూడాలన్నారు. అంతకుముందు డీఈవో అభ్యర్థులకు స్థానికత, రోస్టర్, మెరిట్ తదితర అంశాలపై వివరించారు. ఎవరికీ ఎలాంటి సందేహాలున్నా నేరుగా విద్యాశాఖ అధికారులను సంప్రదించాలని సూచించారు.

సదుపాయాలు బాగున్నాయ్

డైట్ కళాశాలలో సర్టిఫికేట్ పరిశీలనకు ఏర్పాట్లు చేసిన గదుల్లోకి గాలి, వెలుతురు వచ్చేలా కౌంటర్లు ఏర్పాటు చేయడం అభినందనీయమని కలెక్టర్ విద్యాశాఖ అధికారులను అభినందించారు. అభ్యర్థులకు తాగునీటి సౌకర్యం, మౌలిక వసతులకు ఎలాంటి లోటురాకుండా చూసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా డీఈవో రవీందర్ మాట్లాడుతూ.. తాగునీటికి ప్రత్యేక ఏర్పాట్లు చేశామని తెలిపారు. కార్యక్రమాల్లో ఏడీ అనసూయ, సీఎంవో డా.బైకని బాలుయాదవ్, ఏఎంవో శ్రీనివాస్, డీఈవో కార్యాలయ సూపరింటెండెంట్ శంభుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ కార్డుల సర్వే పరిశీలన

జడ్చర్ల, అక్టోబర్ 4: మండలంలోని అల్వాన్‌పల్లి, జడ్చర్ల మున్సిపాలిటీలో 24వ వార్డులో నిర్వహిస్తున్న డిజిటల్ సర్వేను శుక్రవారం కలెక్టర్ విజయేందిరబోయి పరిశీలించారు. ఇంటింటి సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు మోహన్‌రావు, శివేంద్రప్రతాప్, తాసీల్దార్ బ్రహ్మంగౌడ్, 24వ వార్డు కౌన్సిలర్ ప్రశాంత్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

భూత్పూర్ మండలంలో..

భూత్పూర్, అక్టోబర్ 4: పట్టణంలోని 9వ వార్డులో చేపడుతున్న డిజిటల్ సర్వేను కలెక్టర్ విజయేందిర బోయి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సర్వే జరుగుతున్న వార్డులో ఇండ్లను పరిశీలించారు. ఇందుకు సంబంధించిన వివరాలను కమిషనర్ సురేందర్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, మేనేజర్ శంకర్‌నాయక్, వార్డు ఆఫీసర్లు, ఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.


సర్టిఫికెట్ పరిశీలన కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిరబోయి

పత్తి కొనుగోళ్లకు ఏర్పాట్లు చేయాలి

● పేట కలెక్టర్ సిక్తాపట్నాయక్

నారాయణపేట టౌన్, అక్టోబర్ 4 : వానకాలం పత్తి కొనుగోళ్లకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సిక్తాపట్నాయక్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వం ఈ ఏడాది పత్తి క్వింటాలుకు రూ.7,521 మద్దతు ధర ప్రకటించిందని, తేమశాతం 12కు మించకుండా కొనుగోలు కేంద్రాలకు పత్తిని తీసుకువచ్చేలా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. కొనుగోలుకు సంబంధించి ఎలాంటి సమస్య ఉన్నా అధికారులు సమన్వయంతో పరిష్కరించుకోవాలన్నారు. జిన్నింగ్ మిల్లులో ఫైర్ సేఫ్టీ యంత్రాలను ఏర్పాటు చేసుకొని అగ్ని ప్రమాదాలు జరుగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా మార్కెటింగ్ అధికారిణి బాలమణి మాట్లాడుతూ ఈ ఏడాది వ్యవసాయశాఖ అధికారుల లెక్కల ప్రకారం జిల్లాలో 1,65,150 ఎకరాలలో రైతులు పత్తి సాగు చేయడం జరిగిందని, 9,90,900 క్వింటాళ్ల పత్తి కొనుగోలు చేయాల్సి ఉంటుందని తెలిపారు. జిల్లాలోని నారాయణపేట, మక్తల్ మార్కెట్‌లలో సీసీఐ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని, ఆయా నియోజకవర్గాలలో 7 జిన్నింగ్ మిల్లులు ఉన్నాయన్నారు. నవంబర్ రెండో వారంలో పత్తి విక్రయాలు జరుగుతాయన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్, ఆర్డీవో మేఘాగాంధీ, సీసీఐ జిల్లా అసిస్టెంట్ మేనేజర్ దిలీప్ ఐవార్, సీసీఐ అధికారి రాహుల్ పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తాపట్నాయక్

డిజిటల్ సర్వే పకడ్బందీగా నిర్వహించాలి

డిజిటల్ కుటుంబ సర్వేకు ఎంపిక చేసిన పైలట్ గ్రామాలు, వార్డుల పరిధిలో ఏ ఒక్క కుటుంబం మిస్ కాకుండా పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని 15వ పైలట్ వార్డులో కొనసాగుతున్న డిజిటల్ సర్వేను ఆమె తనిఖీ చేశారు. వార్డులో మొత్తం 246 కుటుంబాలకు గానూ 205కుటుంబాల సర్వే పూర్తయిందని, ఇంకా 40 కుటుంబాల సర్వే చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ సునీత తెలిపారు.

కొనసాగుతున్న ధ్రువపత్రాల తనిఖీ

నారాయణపేటరూరల్, అక్టోబర్ 4 : నారాయణపేట జిల్లా కేంద్రంలోని ఎస్సీ బాలుర హాస్టల్‌లో డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన కొనసాగుతున్నది. పరిశీలన కేంద్రాన్ని శుక్రవారం కలెక్టర్ సిక్తాపట్నాయక్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ధ్రువపత్రాలు అన్ని సక్రమంగా ఉన్నాయా లేదా అడిగి తెలుసుకున్నారు. ఎవరైన తప్పుడు ధ్రువపత్రాలు సమర్పిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. ఇంకా మెరిట్ జాబితాలో ఉన్న అభ్యర్థులు ఎవరైనా రాకపోతే వారికి ఫోన్ ద్వారా సమాచారం అందించాలని సూచించారు. ఆమె వెంట డీఈవో అబ్దుల్‌గని, సెక్టోరల్ అధికారులు శ్రీనివాస్, రాజేంద్రకుమార్, పద్మానళిని, రామచంద్రాచారి, నాగార్జునరెడ్డి, భానుప్రకాశ్ తదితరులు ఉన్నారు.

డీఎస్సీ టాపర్‌ను సత్కరించిన మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి


విద్యాసాగర్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

మక్తల్, అక్టోబర్ 4: ఇటీవల తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసిన డీఎస్సీ ఫలితాల్లో నారాయణపేట జిల్లా టాపర్‌గా నిలిచిన విద్యాసాగర్‌గౌడ్‌ను శుక్రవారం ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి తన నివాసంలో శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మక్తల్ మండలం కాచ్వార్‌కు చెందిన విద్యాసాగర్‌గౌడ్ గురుకుల పీడీగా విధులు నిర్వహిస్తూ డీఎస్సీ పరీక్షల్లో పీఈటీ విభాగంలో నారాయణపేట జిల్లా టాపర్‌గా నిలవడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు గణేశ్ కుమార్, టౌన్ అధ్యక్షుడు రవికుమార్, కాచ్‌వార్ ప్రజలు మదన్ రెడ్డి, శ్రీకాంత్ గౌడ్, వెంకటేశ్, విశ్వనాథ్, నాగేశ్, వివేక్ తదితరులు ఉన్నారు.

సజావుగా ఓపెన్ పది, ఇంటర్ పరీక్షలు

● ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ శివయ్య

పరీక్షను పరిశీలిస్తున్న కోఆర్డినేటర్ శివయ్య

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, అక్టోబర్ 4: సార్వత్రిక విద్య (తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ) పరీక్షలు సజావుగా కొనసాగుతున్నట్లు ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ శివయ్య తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని షాసాబ్‌గుట్ట ప్రభుత్వ ఉన్నత పాఠశాల, మహాత్మాగాంధీ రోడ్ ఉన్నత పాఠశాలలోని పరీక్షా కేంద్రాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పదో తరగతి పరీక్షకు 41మందికి గానూ 35మంది హాజరు కాగా.. ఇంటర్‌కు 49 మందికి గానూ 35మంది హాజరయ్యారని పేర్కొన్నారు.

అపరాధ రుసుంతో అడ్మిషన్ ఫీజు

తెలంగాణ సార్వత్రిక విద్యాపీఠం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఓపెన్ స్కూల్‌లో 2024-25 సంవత్సరానికి పదో తరగతి, ఇంటర్‌లో అడ్మిషన్ పొందగోరు విద్యార్థులు ఈనెల 31వరకు అపరాధ రుసుంతో అడ్మిషన్ ఫీజు చెల్లించేందుకు అవకాశం కల్పించినట్లు ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ శివయ్య శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఆసక్తి, అర్హతగల అభ్యర్థులు అడ్మిషన్ ఫీజును టీజీ ఆన్‌లైన్, మీసేవ ద్వారా చెల్లించాలని పేర్కొన్నారు.

రేషన్ డీల్లర్‌పై విచారణ

మిడ్జిల్, అక్టోబర్ 4: మండలంలోని వెలుగొమ్ముల రేషన్ డీలర్‌పై తాసీల్దార్ ఆదేశాల మేరకు ఆర్ఐ అంబిక గ్రామంలో విచారణ చేపట్టారు. రేషన్ దుకాణం తన ఇంట్లో ఏర్పాటు చేసుకోవడంతో ఇబ్బందులు పడుతున్నామని, వెంటనే గ్రామం మధ్యలో ఏర్పాటు చేయాలని, ప్రజలను ఇబ్బంది పెట్టిన డీలర్‌పై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు సూచించారు. వెంటనే డీలర్ షాపును ఇంటి నుంచి మార్చాలని సూచించారు. విచారణలో బాల్‌రెడ్డి, బాబా, బాలరాజు, లక్ష్మారెడ్డి, కృష్ణయ్య, రాజేందర్‌రెడ్డి, రాములు, రవీందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

భార్య మందలించిందని భర్త ఆత్మహత్య

బాలానగర్ (రాజాపూర్), అక్టోబర్ 4: తాగుడుకు బానిసై పనీపాటా లేకుండా తిరుగుతున్నావని భార్య మందలించడంతో భరించలేక భర్త ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం తెల్లవారుజామున చోటుచేసుకన్నది. రాజాపూర్ ఎస్సై రవి కథనం ప్రకారం.. రంగారెడ్డి గూడకు చెందిన కాటిపాడ మురళి (26) పోలేపల్లి పారిశ్రామిక వాడలోని ఓ పరిశ్రమలో పనిచేస్తూ అత్తగారి ఊరైన పోలేపల్లిలో భార్య శ్రీవేణితో కలిసి నివాసముంటున్నాడు. కొంతకాలంగా తాగుడుకు బానిసై ఖాళీగా తిరుగుతున్నాడు. ఖాళీగా తిరిగితే ఇల్లు గడిచేదెలా అంటూ భార్య గురువారం మందలించడంతో రంగారెడ్డిగూడలోని తల్లి ఎల్లమ్మ వద్దకు వెళ్లాడు. శుక్రవారం తెల్లవారుజామున గ్రామశివారులోని చింతచెట్టుకు చీరతో ఉరేసుకున్నాడు. ఉదయం ఏడు గంటల ప్రాంతంలో గ్రామానికి చెందిన పెరుమాళ్ల జంగయ్య గమనించి పోలీసులకు సమాచారం అందించాడు. కేసు నమోదు చేసి, మృతదేహాన్ని జడ్చర్ల దవాఖానకు తరలించినట్లు తెలిపారు.

పేట సీనియర్ సివిల్ జడ్జిగా విద్యానాయక్

నారాయణపేట, అక్టోబర్ 4 : హైదరాబాద్‌లోని సిటీ సివిల్ కోర్టులో 8వ అసిస్టెంట్ జడ్జిగా విధులు నిర్వహిస్తున్న విద్యానాయక్ నారాయణపేట సీనియర్ సివిల్ జడ్జి, అండ్ అసిస్టెంట్ సెషన్ జడ్జిగా బదిలీపై రానున్నారు. ప్రస్తుతం పేట సీనియర్ సివిల్ జడ్జిగా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస్ నిర్మల్ బదిలీపై వెళ్లారు. ఈ మేరకు శుక్రవారం తెలంగాణ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

ఎంపికైన కొండాపూర్ గిరిజన విద్యార్థులు

ధన్వాడ, అక్టోబర్ 4 : నేటి నుంచి ఈనెల 7వ తేదీ వరకు కొత్తగూడెంలో నిర్వహించే 68వ ఎస్‌జీఎఫ్ పోటీలకు ఉమ్మడి మహబూబ్‌నగర్ అండర్-17 జట్టుకు కొండాపూర్ గిరిజన గురుకుల విద్యార్థులు వెంకటేశ్, సిద్ధార్థ, చరణ్‌కుమర్, అరుణ్‌కుమార్ ఎంపికైనట్లు పీఈటీ సుగుణాకర్ తెలిపారు. వీరు ఇటీవల గద్వాల జిల్లా కేంద్రంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఎంపికల్లో వీరు ప్రతిభకనబర్చి రాష్ట్ర జట్టుకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. వీరిని ప్రిన్సిపాల్ రాజారాం, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, సాంబయ్య నాయక్‌తోపాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాలో అవాంతరాలు ఉండొద్దు

నవాబ్‌పేట, అక్టోబర్ 4: గ్రామీణ తాగునీటి సరఫరాలో ఎలాంటి అవాంతరాలు ఏర్పడకుండా నీటి సరఫరా సహాయకులు కృషిచేయాలని గ్రామీణ నీటి సరఫరా జిల్లా ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పుల్లారెడ్డి పేర్కొన్నారు. ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో గ్రామీణ నీటి సరఫరా శాఖ ఆధ్వర్యంలో నీటి సరఫరా సహాయకులకు నిర్వహించిన మొదటి విడుత శిక్షణా శిబిరానికి పుల్లారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మిషన్ భగీరథ నీటి సరఫరాలో ఎక్కడైనా లోపాలు, లీకేజీలు ఉంటే ఉన్నతాధికారులకు సమాచారం అందజేయాలన్నారు. అలాగే గ్రామాల వారీగా వారి రూట్లలో ఏమైనా సమస్యలుంటే తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో జయరామ్‌నాయక్, ఎంపీవో భద్రునాయక్, ఏఈ షమీయుల్లాఖాన్, నీటి సరఫరా సహాయకులు పాల్గొన్నారు.

చెరువుల్లో చేప పిల్లల విడుదల

ఊట్కూర్, అక్టోబర్ 4: మండలంలోని చిన్నపొర్ల, పెద్ద పొర్లలో శుక్రవారం అధికారులు, మత్స్య సహకార సంఘం సభ్యులు పాల్గొని చెరువులో చేపపిల్లలను విడిచారు. కార్యక్రమానికి మత్స్య సహకార సంఘం నారాయణపేట జిల్లా అధ్యక్షుడు కాంతకుమార్ హాజరై మాట్లాడుతూ మత్స్యకార్మికులు ఐక్యతతో సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మత్స్య సహకార సంఘం డైరెక్టర్, గ్రామ సంఘం అధ్యక్షుడు ఆనంద్‌కుమార్, రామకృష్ణ, కురుమూర్తి, ఆంజనేయులు, రాములు పాల్గొన్నారు.

రికార్డులు సక్రమంగా నమోదు చేయాలి

● ట్రైనీ కలెక్టర్ గరిమనరుల

మరికల్, అక్టోబర్ 4 : పల్లె దవాఖానల్లో రికార్డులను సక్రమంగా నమోదు చేయాలని ట్రైనీ కలెక్టర్ గరిమనరుల సూచించారు. శుక్రవారం మండలంలోని తీలేరు పల్లె దవాఖానను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దవాఖానకు వచ్చే రోగులకు మెరుగైన చికిత్సలు అందించి వారికి మందులు కూడా అందించాలన్నారు. చిన్నారులు, గర్భిణులకు ఇచ్చే నెల సూదులు, టీకాలు సక్రమంగా ఇస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఇబ్రహీంపట్నం గ్రామంలో పర్యటించి గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని గ్రామస్తులకు సూచించారు. అయితే గ్రామస్తులు మరికల్ డంపింగ్ యార్డు వల్ల గ్రామంలోకి తీవ్ర దుర్గంధం వస్తున్నదని, వెంటనే డంపింగ్ యార్డును మార్చాలని గ్రామ యువకులు ట్రైనీ కలెక్టర్‌ను కోరారు. ఆమె కలెక్టర్‌తో మాట్లాడి మీ సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీవో కొండన్న, ఎంపీవో పావని, కార్యాలయ సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

రికార్డులు పరిశీలిస్తున్న శిక్షణ కలెక్టర్ గరిమనరుల

9న మాజీ ఎమ్మెల్యే మహాపాదయాత్ర

కోస్గి(మద్దూరు), అక్టోబర్ 4 : ఫార్మా కంపెనీ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి ఈనెల 9న మహాపాదయాత్ర నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ శాఖ జిల్లా మాజీ చైర్మన్ శాసం రామకృష్ణ తెలిపారు. శుక్రవారం కోస్గిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దుద్యాల్ మండలంలోని లగచర్ల, హకీంపేట్, పోలేపల్లి, పల్లిచర్లకుంటతండా, ఈర్లపల్లి తండా, రోటిబండతండా గ్రామాల్లో ఫార్మా విలేజ్‌ను ఏర్పాటు చేయాలనుకున్న రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకించడంతోపాటు అర్హులైన రైతులందరికీ రుణమాఫీ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 9వ తేదీ మాజీ ఎమ్మెల్యే పట్నం పాదయాత్ర నిర్వహిస్తున్నారన్నారు. ఈ పాదయాత్రను పోలేపల్లి రేణుకా ఎల్లమ్మ ఆలయం నుంచి ప్రారంభించి ఆయా బాధిత గ్రామాల మీదుగా కొడంగల్ వెంకటేశ్వర స్వామి ఆలయం వరకు యాత్ర నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పాదయాత్రలో ప్రజలు పాల్గొన్ని విజయవంతం చేయాలని శాసం రామకృష్ణ కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు వెంకట్‌నర్సింహులు, కోనేరు సాయప్ప, జెజ్జు నర్సింహులు, శ్రీను, నవీన్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మాజీ చైర్మన్ శాసం రామకృష్ణ

లారీబోల్తా: ఇద్దరికి గాయాలు

మూసాపేట, అక్టోబర్ 4 :లారీ బోల్తాపడి ఇద్దరికి గాయాలైన ఘటన శుక్రవారం తెల్లవారుజామున 3గంటలకు చోటుచేసుకున్నది. స్థానికుల కథనం ప్రకారం.. గుజరాత్‌కు చెందిన లారీ యూరియా బస్తాల లోడుతో తిరుపతికి వెళ్తున్నది. మార్గమధ్యంలో మూసాపేట మండలంలోని కొమిరెడిపల్లి జాతీయ రహదారిపైకి రాగానే.. డ్రైవర్ వెంకటగోవిందు మోరె నిద్రమత్తులోకి జారుకున్నాడు. దీంతో లారీ అదుపుతప్పి బోల్తాపడింది. లారీ ఇంజన్, బాడి వేరువేరయ్యాయి. ప్రమాదంలో డ్రైవర్ వెంకటగోవిందు మోరె, క్లీనర్ సుక్‌దేవ్‌కు గాయాలయ్యాయి. స్థానికులు అంబులెన్స్‌లో దవాఖానకు తరలించారు.

బోల్తాపడిన లారీ

హైమాస్ట్ లైట్లు ప్రారంభం

మూసాపేట, అక్టోబర్ 4: మండలంలోని జానంపేటలో శుక్రవారం ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి హైమాస్ట్ లైట్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు శెట్టి శేఖర్, మాజీ ఎంపీపీ కృష్ణయ్య, మాజీ ఎంపీటీసీ కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఎక్కువున్న పాఠశాలలకు కేటాయించాలి

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, అక్టోబర్ 4: నూతనంగా నియమించబోయే డీఎ